సాక్షి
సూర్యాపేట
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



రైతు, డ్రైవర్ దుర్మరణం
బురదమడి దున్నుతున్న క్రమంలో తొలుత రైతు...ఆ వెంటనే డ్రైవర్ ట్రాక్టర్ కిందపడి దుర్మరణం చెందారు. - 8లో



మూగజీవాలనూ వదలట్లే..!
నల్లగొండ జిల్లాలో పలు గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు మూగజీవాలను అపహరించుకుపోతున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32°/25°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధితులకు అండగా ఉండాలి

● ఎస్పీ రాజేంద్ర ప్రసాద్



పోలీస్ అధికారులను అభినందిస్తున్న ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

సూర్యాపేట క్రైం: గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి, బాధితులకు అండగా ఉంటూ భరోసా కల్పించాలని జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేలో భాగంగా ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. రైతులు వ్యవసాయ పనుల దృష్ట్యా రోడ్లపై అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ ట్రాక్టర్లను రోడ్లపై నడిపేటప్పుడు ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం వివిధ కేసుల్లో పోలీసుల స్వాధీనంలో ఉన్న వాహనాలకు కోర్టు అనుమతులతో ఆన్‌లైన్‌లో నమోదు చేసి వేలం నిర్వహణకు కృషి చేసిన డీఎస్పీలు రవి, శ్రీనివాస్, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఆర్ఐ శ్రీనివాస్, ఏఓ సురేష్‌బాబు, సీసీ సందీప్‌లకు ఎస్పీ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, సీఐలు అశోక్‌రెడ్డి, రాఘవులు రామకృష్ణారెడ్డి, మహేష్ తదితరులు ఉన్నారు.

సూర్యాపేట ఏఎస్పీగా మేక నాగేశ్వర్‌రావు



సూర్యాపేట క్రైం: సూర్యాపేట అడిషనల్ ఎస్పీగా మేక నాగేశ్వర్‌రావును నియమిస్తూ రాష్ట్ర డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట, దేవరకొండ డీఎస్పీగా పని చేసిన ఈయనకు ఇటీవల అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు సూర్యాపేట అడిషనల్ ఎస్పీగా నాగేశ్వర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు 3వ స్థాయీ సంఘం సమావేశం

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం 3వ స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఒక అభ్యర్థికి ఒకే పరీక్ష కేంద్రం కేటాయించాలి

కోదాడ అర్బన్: గురుకుల విద్యాలయాల్లో జేఎల్, డీఎల్, టీజీటీ, పీజీటీ, లైబ్రేరియన్ ఉద్యోగ నియామక పరీక్షలకు ఒక అభ్యర్థికి ఒకే సెంటర్ కేటాయించాలని పీవైఎల్ (ప్రగతిశీల యువజన సంఘం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లగొండ నాగయ్య, రవి డిమాండ్ చేశారు. కోదాడలోని లాల్ బంగ్లాలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఒక్కో అభ్యర్థికి మూడు నాలుగు సెంటర్లను కేటాయించడం గందరగోళంగా ఉందన్నారు. అభ్యర్థులకు కేటాయించిన మల్టీపర్పస్ (ఒకే అభ్యర్థి మూడు సెంటర్లలో పరీక్ష రాయడం) విధానాన్ని రద్దు చేయాలన్నారు. అభ్యర్థులకు వారి సొంత జిల్లా కేంద్రాల్లోనే పరీక్షలు నిర్వహించాలన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేకార్చనలు, ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, బ్రహ్మాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామాచార్యులు, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ

చివ్వెంల(సూర్యాపేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా అద్దంకిలో న్యాయవాది విశాల్ బాబు హత్యను నిరసిస్తూ సోమవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలెబోయిన నర్సయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు కంచర్ల సతీష్‌కుమార్, జాయింట్ సెక్రటరీ రాంపాక ఉప్పలయ్య, కోశాధికారి రాచకొండ యాదగిరి, న్యాయవాదులు పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం

ఇప్పటికే నిర్వహణ లేక దెబ్బతిన్న రోడ్లు

- వర్షాలతో కొన్ని చోట్ల మోకాలిలోతు గుంతలు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న జనం
- నిధుల్లేక మరమ్మతులు చేపట్టని పరిస్థితి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో రోడ్లు ఛిద్రమయ్యాయి. ఒక్కో చోట మోకాలి లోతు గుంతలు ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోడ్లపై గుంతల విషయం తెలియనివారు ప్రమాదాల బారిన పడుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాల కారణంగా అనేక గ్రామాలు, మండలాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. నిధుల లేమి కారణంగా వాటిని మరమ్మతులు చేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలతో అవి మరింత ధ్వంసమయ్యాయి. దీంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది.

నిధుల్లేక.. మరమ్మతులు చేయక..

వర్షాలతో రోడ్లు దెబ్బతిన్నా వాటి మరమ్మతు విషయంలో అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయతీ రాజ్ రోడ్లే కాదు.. రాష్ట్ర, జాతీయ రహదారులు దెబ్బతింటున్నా పట్టించుకోవడం లేదు. రోడ్ల మరమ్మతుకు సంబంధించి ప్రతిపాదనలు పంపేందుకే జిల్లాస్థాయి అధికారులు పరిమితమవుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో మరమ్మతు పనులు చేపట్టే పరిస్థితి లేకుండా పోతోంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదీ జిల్లాలోని రోడ్ల పరిస్థితి

- నిత్యం వందల మంది భక్తులతో కిక్కిరిసిపోయే కనగల్ మండలం ధర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ దేవస్థానం వద్ద నల్లగొండ - దేవరకొండ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఆలయం వద్ద రోడ్డుపై గుంతల్లో తాత్కాలికంగా ఎర్రమట్టి పోయడంతో వర్షానికి మట్టి పూర్తిగా కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి చిత్తడిగా మారింది.
- వేములపల్లి మండలం లక్ష్మీదేవిగూడెం గ్రామ పంచాయతీ చలిచీమలపాలెం వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తిగా దెబ్బతింది. మిర్యాలగూడ నుంచి వయా భీమారం సూర్యాపేట వెళ్లే రోడ్డు సల్కునూరు పెట్రోల్ బంక్ వద్ద దెబ్బతిని పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.
- గుండాల మండలం మరిపడిగ గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రోడ్డు ఇటీవల వర్షాలకు తెగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం పరిధిలోని నశీంపేట వద్ద హైలెవెల్ బ్రిడ్జి నిర్మిస్తుండగా ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాల తాకిడికి కొట్టుకుపోయింది. వర్షాలు తగ్గి మూడు రోజులవుతున్నా రోడ్డు బాగు చేయకపోవడంతో మండల కేంద్రానికి నశీంపేట, రామోజీతండా, రామన్నగూడెం, ఏపూరు, బొప్పారం, కొత్తగూడెం, మిడతనపల్లి గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి.

నల్లగొండలోని దేవరకొండ రోడ్డు వినాయక హౌజింగ్ బోర్డు కాలనీ వద్ద రోడ్డుపై చిన్న వర్షానికే నీళ్లు నిలుస్తున్నాయి. నాలుగు నెలల కిందట పడిన వర్షాలకు రోడ్డు గుంతలుగా మారింది. అందులో నీరు నిలువడంతో గుంతను గ్రహించకపోవడంతో ఆటో బోల్తా పడింది. అందులోని ఓ మహిళ చేయి విరిగింది.



చివ్వెంల-ముకుందాపురం రహదారిపై నశీంపేట వద్ద వరదలతో కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు



సల్కునూరు పెట్రోల్‌బంక్ వద్ద గుంతలమయం అయిన మిర్యాలగూడ- సూర్యాపేట రోడ్డు

రూ.45.48 కోట్ల నష్టం జరిగింది

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో 239 కిలోమీటర్ల పొడవున 124 పంచాయతీ రోడ్లు, సిమెంట్ రోడ్లు దెబ్బతిన్నాయి. రూ.45.48 కోట్ల నష్టం జరిగింది. రూ.5.5 కోట్లతో తాత్కాలిక మరమ్మతు చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. శాశ్వత మరమ్మతులకు రూ.32.72 కోట్లు అవసరం.

– తిరుపతయ్య, పంచాయతీరాజ్ ఈఈ, నల్లగొండ

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం

ఉమ్మడి జిల్లాలోని రాష్ట్ర రహదారులు 3,621 కిలోమీటర్ల మేర పునరుద్ధరణకు ప్రతిపాదనలు పంపించాం. నల్లగొండ జిల్లాలో 1,836 కిలోమీటర్లు, సూర్యాపేట 907 కిలోమీటర్లు, యాదాద్రి భువనగిరిలో 877 కిలోమీటర్ల పొడవున రోడ్లు మరమ్మతులు చేసేందుకు రూ.120 కోట్లు కావాలని కోరాం. నల్లగొండ జిల్లాలో ఇటీవల వర్షాల వల్ల 115 కిలోమీటర్లు మేర రాష్ట్ర రహదారులు దెబ్బతిన్నాయి.

– నర్సింహ, రోడ్డు భవనాల శాఖ ఎస్ఈ

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించండి

● ప్రజావాణిలో కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. అర్జీదారుల ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలు, శాఖల వారీగా అందిచిన నివేదికలు పరిశీలించుటకు జెడ్పీ సీఈఓ సురేష్ నేతృత్వంలో ఆరుగురు అధికారులతో ఆడిట్ బృందాన్ని నియమించామని తెలిపారు. ప్రతి వారం ప్రజావాణి దరఖాస్తులు సంబంధిత శాఖలకు అందుతున్నాయా..? లేదా..? అనే అంశాన్ని ఈడీఎం, ఎస్ఐసీ ఆపరేటర్లు పరిశీలించాలని తెలిపారు. ఆడిట్‌లో భాగంగా హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని మండలాల భూముల దరఖాస్తులపై స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం డివిజనల్ అధికారి కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్షించాలన్నారు. అలాగే ప్రతి 4వ శుక్రవారం తహసీల్దార్లతో సమీక్షించాలన్నారు. అదే రోజు శాఖల వారీగా ఆయా అధికారులతో సమీక్షించుకోవాలని సూచించారు. కాగా ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సిహెచ్ ప్రియాంక, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ ఏ. వెంకట్ రెడ్డి, జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సమస్య.. తక్షణ పరిష్కారం

ప్రజావాణిలో ఓ రైతు ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు వెంటనే స్పందించారు. దీంతో ఆ రైతు సమస్యకు పరిష్కారం లభించి తక్షణమే న్యాయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. చివ్వెంలకు చెందిన వేర్పుల అమ్మయ్య ఏప్రిల్ 15న ఎర్రసూర్యతండా ఐకేపీ సెంటర్‌లో 419 బస్తాల ధాన్యం విక్రయించగా 27 బస్తాల ధాన్యం డబ్బులు కోత విధించారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ వెంటనే సెంటర్ నిర్వాహకులను పిలిపించి మాట్లాడి రైతుకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతర సెంటర్ నిర్వాహకులను విచారించగా తప్పును ఒప్పుకొని రైతుకు 27 బస్తాల ధాన్యానికి గాను డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి

తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామ స్థాయిలో సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.వెంకట్‌రెడ్డితో కలిసి తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఆగస్టు ఈ నెల 2న అన్ని మండల సమైక్యలతో సమావేశం ఏర్పాటు చేసి తల్లిపాలపై అవగాహన కల్పించాలని, మండల ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, డీఆర్‌డీఓ ఎస్.కిరణ్ కుమార్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శంకర్, పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ ఆవిష్కరణ

స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా ఆగస్టు 15న ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఇంటింటా ఇన్నోవేటర్ వాల్‌పోస్టర్‌ను అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, ప్రియాంకతో కలిసి ఆవిష్కరించారు. స్థానిక సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా సృజనాత్మక ఆవిష్కరణలను ఆగస్టు 5వ తేదీలోగా వాట్సాప్ నంబర్ 9100 678543కు పంపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, డీఈఓ అశోక్, ఈడీఎం గఫార్, అధికారులు పాల్గొన్నారు.



తల్లి పాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్లు, అధికారులు

తుది శ్వాస వరకూ కాంగ్రెస్‌లోనే..

● టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్డీఆర్



మాట్లాడుతున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట: నా చివరి శ్వాస వరకూ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. కొందరు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులతోపాటు సొంత పార్టీ నాయకులు వారికి జత కలిసి ఉన్నవి లేనివి చెబుతున్నారన్నారు. నాలుగు తరాలుగా కాంగ్రెస్‌లోనే ఉన్న నాలాంటి వ్యక్తిపై దుష్ప్రచారం ప్రచారం జరగడం దురదృష్టకరమన్నారు. నాకు గ్రూపులు లేవని, నాది కాంగ్రెస్, సోనియా గ్రూప్ మాత్రమేనన్నారు. బీఆర్ఎస్ నేతలలెవరు కూడా తనను కలవలేదని, అసలు నన్ను పార్టీ మారమని అడిగే దమ్ము ఎవరికీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై సూర్యాపేట నుంచి ఈసారి పోటీ చేస్తున్నానని, టికెట్ నాదే, గెలుపు నాదేనని ధీమా వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. లోకల్, నాన్ లోకల్ ప్రచారం కరెక్ట్ కాదని, 40 ఏళ్లుగా సూర్యాపేట జిల్లా కేంద్రంగా రాజకీయాల్లో ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. ఇండిపెండెంట్‌గా గెలిచినా.. ఎన్ని అవకాశాలు వచ్చినా పార్టీ మారకుండా తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చానన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తానని, పార్టీ మార్పు కుట్రలను కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

రాజకీయ రిజర్వేషన్ల సాధనకు పోరాడుదాం




ప్రమాణస్వీకారంలో పాల్గొన్న సభ్యులు

గరిడేపల్లి: వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ల సాధనకు గల్లీ నుంచి ఢిల్లీదాకా రాజకీయ పార్టీలపై పోరాడుదామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. సమితి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కుర్ర గోపియాదవ్‌తోపాటు నూతన ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో రాజ్యాధికారానికి దూరమై దుర్భర జీవితాలను గడుపుతున్న వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు అన్ని పార్టీలు ముందుకు రావాలన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ వికలాంగులకు ఇచ్చే పింఛన్‌ను రూ.10వేలకు పెంచాలన్నారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వికలాంగులకు ఎన్ని స్థానాలు కేటాయిస్తారో స్పష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈదయ్యబాబు, రఫీ, గుర్రం నరేష్‌రెడ్డి, నాగమణి, సైదులు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీను, వెంకటేశ్వర్లు గౌడ్, జానయ్య, కొండ సైదులు, ఎల్లయ్య, దేవదానం, మధు, వీరయ్య, ఆదినారాయణ, పవన్, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లైనింగ్ కుంగి.. బుంగపడి

● 120 కిలోమీటర్ వద్ద ప్రమాదకరంగా సాగర్ ఎడమ కాల్వకట్ట



రామాపురం సమీపాన కట్టకు పడిన బుంగ

నడిగూడెం: మండల పరిధిలోని రామాపురం గ్రామ సమీపాన 120 కిలోమీటర్ వద్ద సాగర్ ఎడమ కాల్వ కట్టకు బుంగ పడి ప్రమాదకరంగా ఉంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాల్వ లైనింగ్ కుంగడంతో పాటు, కట్ట కోతకు గురై బుంగ ఏర్పడింది. ఒకవేళ నాగార్జున్ సాగర్ జలాశయం నుంచి ఎడమ కాల్వకు నీటిని విడుదల చేస్తే ఈ ప్రదేశంలో కాల్వకు భారీ గండి పడే ప్రమాదం పొంచి ఉందని రైతులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత ఎన్ఎస్‌పీ అధికారులు స్పందించి తక్షణమే బుంగ వద్ద మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

పెన్‌పహాడ్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంతోపాటు వివిధ పాఠశాలల్లో చేపట్టిన ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 317 జీఓ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతరెడ్డి రామలింగారెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు సంధ్యాల వినోద్, నల్లా శ్రీనివాస్, ప్రతినిధులు అల్లాడి సత్యనారాయణ, మామిడి వెంకటయ్య, సుదర్శన్, శ్రీపాద ఉపేందర్, గునగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భానుపురి (సూర్యాపేట): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించి పాఠశాల విద్యా వ్యవస్థను పరిరక్షించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ పేరుతో సోమవారం సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ ఏఓ శ్రీలతకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పీఆర్సీ కమిటీని వేసి, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్ లో ఉన్న అన్ని డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగంపల్లి హరిప్రసాద్, జిల్లా కోశాధికారి అమరవాది బ్రహ్మచారి, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి శ్రీనివాస్, నేరెళ్ల దేవరాజ్, మీడియా ఇన్‌చార్జ్ పోతుగంటి శ్రీనివాసరావు, కార్యదర్శులు పోతుగంటి శ్రీనివాసాచారి, భట్టుపల్లి సాయికుమార్, నాగిరెడ్డి జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, మండల బాధ్యులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న టీపీయూఎస్ నాయకులు, ఉపాధ్యాయులు

కళ్ల కలకతో కలవరం

- నాలుగు రోజులుగా 500పైగా కేసులు నమోదు
- ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తున్న ఐ ఫ్లూ
- కళ్లు ఎర్రగా మారి నీరు కారుతుండడంతో ఇబ్బందుల్లో బాధితులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

తిరుమలగిరి (తుంగతుర్తి): కళ్ల కలక.. జిల్లా ప్రజలను కలవర పెడుతోంది. నాలుగు రోజులుగా ఈ వ్యాధి (ఐ ఫ్లూ) ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు దీని బారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళ్ల కలక.. బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల సోకుతుంది. కళ్లు ఎర్రగా మారడం, కంటి నుంచి నీరు రావడం, దురద, కంటి నొప్పి, కంటి రెప్పలు అతుక్కుపోవడం, వాపు రావడం వంటివి దీని లక్షణాలు. బ్యాక్టీరియా ద్వారా వచ్చిన వారిలో ఐదు రోజుల్లో తగ్గిపోతుంది. అదే వైరస్ వల్ల వస్తే ఒకటి లేదా రెండు వారాల వరకు ఉంటుందని వైద్యులు అంటున్నారు.

కళ్ల కలక అంటే..

దుమ్ము, ధూళి, చలి, వేడి నీళ్ల కంటిపై ప్రభావం చూపించినప్పుడు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. దీనినే కళ్ల కలక అంటారు. ఈ మధ్యకాలంలో కళ్లకలక పెద్దగా విస్తరించలేదు. నాలుగు రోజుల నుంచి మాత్రం విద్యార్థులకు ఎక్కువగా వస్తుంది. చిన్న పిల్లలకు వస్తే కొంచెం ప్రమాదకరం.

ఎక్కడెక్కడ వ్యాపించిందంటే..

హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని లింగగిరి, మఠంపల్లి, తుంగతుర్తి నియోజకవర్గంలోని తుంగతుర్తి పీహెచ్‌సీల పరిధిలో కళ్ల కలక వేగంగా వ్యాపిస్తోంది. ఇక్కడి పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటికే మొత్తం 210 కేసులు నమోదయ్యాయని వైద్యాధికారులు తెలిపారు. రెండు రోజులుగా హుజూర్‌నగర్‌లోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకులంలో దాదాపు 300 మంది విద్యార్థులు ఉండగా 60 మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. ఇదిలా ఉంటే జిల్లాలోని 23 పీహెచ్‌సీల పరిధిలో ఒక్కచోట పది వరకు కేసులు నమోదవుతుండగా కొన్నిచోట్ల పదికంటే ఎక్కువగానే నమోదవుతున్నట్లు సమాచారం. కాగా తుంగతుర్తి గిరిజన గురుకుల పాఠశాలల్లో 94 మంది విద్యార్థినులకు కళ్ల కలక రాగా సోమవారం అక్కడ ప్రత్యేక క్యాంపు నిర్వహించి బాధిత విద్యార్థినులను పరీక్షించి మందులు అందజేశారు. అలాగే మఠంపల్లి మోడల్ స్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహించి 12 మంది విద్యార్థులకు చికిత్స చేసి మందులు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 500 పైగా కేసులు నమోదైనట్టు తెలుస్తోంది.



తుంగతుర్తి గురుకులంలో కళ్ల కలక వచ్చిన విద్యార్థినులకు చుక్కల మందు వేస్తున్న వైద్యసిబ్బంది

పాటించాల్సిన జాగ్రత్తలు

- కళ్ల కలక వచ్చినవారు ఇంటి నుంచి బయటకు వెళ్లకపోవడం మంచిది. లేకుంటే ఇతరులకు వ్యాపిస్తుంది.
- బాధితుల వస్తువులను తాకడం చేయవద్దు. పొరపాటున ముట్టుకుంటే చేతులను శుభ్రం చేసుకోవాలి.
- కళ్ల కలక వచ్చే వారికి వేసే డ్రాప్స్‌ను ఇతరులకు వాడకూడదు.
- వ్యాధి నివారణకు యాంటిబయోటిక్ హైడ్రాప్స్, లుబ్రికేటింగ్ హైడ్రాప్స్ వాడితే సరిపోతుంది.
- కళ్ల కలక బారిన పడకుండా ఉండాలంటే చేతులను క్రమం తప్పకుండా సబ్బుతో కడుక్కోవాలి.
- కళ్లను పదేపదే తాక కూడదు. కళ్లను రుద్దడం వంటివి చేయకూడదు.
- దుమ్ము, ధూళి కళ్లల్లో పడకుండా చూసుకోవాలి.
- వానాకాలంలో బయటికి వెళుతున్నట్లయితే కంటి అద్దాలు పెట్టుకోవాలి.
- నివాస స్థలాల్లో దుమ్ము లేకుండా చూసుకోవాలి.

ఇది.. సాధారణ కంటి జబ్బు

కళ్ల కలక అనేది సాధారణ కంటి జబ్బు. కానీ మొదట్లోనే దీనిని నివారించాలి. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కళ్లను ఎప్పటికప్పుడు మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. వైరస్ ద్వారా సంక్రమిస్తే తగ్గేందుకు వారం రోజులు పడుతుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పీహెచ్‌సీలలో యాంటిబయోటిక్ హైడ్రాప్స్, లుబ్రికేటింగ్ హైడ్రాప్స్ అందుబాటులో ఉన్నాయి. అత్యవసరమైతే కంటి వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యాధికారి సూర్యాపేట

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


వెంకన్న (ఫైల్)

చిలుకూరు : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. చిలుకూరు మండల పరిధిలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన అనంతు వెంకన్న(44) రోజు వారీ పనిలో భాగంగా పొలానికి నీరు పెట్టేందుకు విద్యుత్ మోటారు ఆన్ చేశాడు. కరెంట్ లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి ఫీజు వేస్తుండగా 11కేవీ విద్యుత్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వెంకన్న మృతితో జెర్రిపోతులగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వాహనదారుడికి తప్పిన ప్రమాదం

హాలియా : ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన ఓ వాహనదారుడు ప్రమాదశాత్తు ఎడమ కాల్వలో పడి సురక్షితంగా బయటపడ్డాడు. ఈ సంఘటన సోమవారం హాలియా పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన వెంకయ్య గ్యాస్ స్టౌవ్‌లు మరమ్మతులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన బైక్‌పై వెంకయ్య పట్టణంలోని పలు ప్రాంతాలకు వెళ్లి తిరిగి వస్తూ హాలియాలోని ఎడమ కాల్వ వద్ద బ్రిడ్జిని దాడుతున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు బైక్‌తో సహా ఎడమ కాల్వలో పడ్డాడు. ఈ సమయంలో ఎడమ కాల్వకు నీటిని నిలుపుదల చేయడం వల్ల వెంకయ్యకు ప్రాణాపాయం తప్పింది. గమనించిన స్థానికులు కాల్వలో పడిన వెంకయ్యతో పాటు ద్విచక్రవాహనాన్ని బయటికి తీశారు.

మంత్రి జగదీశ్‌రెడ్డికి వినతి

నల్లగొండ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రేషన్ డీలర్ల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు సోమవారం మంత్రి జగదీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాగరాజు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

అర్వపల్లి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. జాజిరెడ్డిగూడెం, చింతపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కరీంనగర్ వైపు లోడుతో వెళ్తున్న లారీ అర్వపల్లికి వచ్చాక ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో వెనక వస్తున్న లారీ డ్రైవర్ విజ్జి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని..

చింతపల్లి : చింతపల్లికి చెందిన కొప్పుల చిన యాదయ్య వింజమూరు వైపు నుంచి సైకిల్‌పై చింతపల్లి మండల కేంద్రం వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా చింతపల్లి నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించడంతో పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

మూగజీవాలనూ వదలట్లే..!

- మేకలు, పశువులను అపహరిస్తున్న దొంగలు
- ఏడు నెలల్లో నల్లగొండ జిల్లాలో 22 కేసులు నమోదు
- 350 పశువులు, 50 మేకలను మాయం చేసిన దుండగులు
- పోలీసులకు తలనొప్పిగా మారిన కేసులు



పక్క చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నాగరాజు. నల్లగొండ పట్టణ శివారు పానగల్ రోడ్డులోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటూ మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. వెంకన్న గత శుక్రవారం సాయంత్రం బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి హాజరయ్యేందుకు ఊరికి వెళ్లాడు. శనివారం తిరిగి వచ్చే సరికి ఇంటి ముందు దొడ్డిలో ఉన్న మేకల మందలో రెండు కనిపించలేదు. దుండగులు అపహరించుకుపోయారని బాధితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఒక వెంకన్న మేకలనే కాదు జిల్లాలోని ఆయా గ్రామాల్లో రైతులు, కాపరుల పశువులు, గొర్లు సైతం చోరీ చేస్తున్నారు.

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు మూగజీవాలను అపహరించుకుపోతున్నారు. వ్యవసాయ బావులు, ఇళ్ల సమీపంలోని దొడ్లను లక్ష్యంగా చేసుకుని మేకలు, పశువులను ఎత్తుకెళ్తున్నారు. గడిచిన ఏడు నెలల కాలంలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 22 కేసులు నమోదు కాగా, 350 పశువులు, 50 మేకలు మాయమైనట్లు పోలీసుల రికార్డులు వెల్లడిస్తున్నాయి.

వారాంతంలో భయం.. భయంగా..

నల్లగొండ సమీప గ్రామాల్లో జీవాలు కాసుకుంటూ జీవనోపాధి పొందుతున్న రైతులు, కాపరులు వారాంతం (శుక్ర, శనివారాలు) వస్తే హడలిపోతున్నారు. గతంలో మునుగోడు, దేవరకొండ, చందంపేట, హాలియా, నల్లగొండలోని రాజీవ్ గృహకల్ప, పాతబస్తీలోని శ్రీకృష్ణనగర్, పానగల్ బైపాస్, శ్రీరాంనగర్ కాలనీల్లో గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి మేతమేస్తున్న మేకలను కారులో వేసుకుని పారిపోయిన ఘటనలు చాలా ఉన్నాయి. రాత్రి సమయాల్లో కరెంట్ పోతే చాలూ దుండగులు కాచుకుని బైక్ లేదా కారులో వచ్చి మేకలను చోరీ చేస్తున్నారు. నల్లగొండ పట్టణంలోని రాక్ హిల్స్ కాలనీలో ఇదే తరహాలో దుండగులు చోరీలకు పాల్పడ్డారు. అదే విధంగా ఆయా మండలాల పరిధిలో బావుల వద్ద, ఇళ్ల ఆవరణలో కట్టేసిన పశువులను కూడా దుండగులు అనువైన వాహనాల్లో వచ్చి అపరించుకుపోయిన ఘటనలు జిల్లాలో ఉన్నాయి.



మద్యానికి బానిసగా మారి..

ఎనిమిది మాసాల క్రితం నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీలో కొందరు యువకులు కారులో వచ్చి మేకలను అపహరిస్తుండగా మఫ్టీలో కాపుకాసిన పోలీసులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే, పట్టుబడిన యువకులంతా మద్యానికి బానిసగా మారిన వారే ఉండడంతో అప్పట్లో వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. కొద్ది రోజుల క్రితం మేళ్లదుప్పల పల్లి రోడ్డులో పందులను చోరీ చేస్తున్నారని బాధితులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిని హాలియాలో పట్టుకున్నారు. జిల్లా కేంద్రం శివారు ప్రాంతాల్లో కోళ్లు సైతం చోరీకి గురవుతున్నాయని పోలీసులకు ఫిర్యాదులు అందుతుండడంతో తలలు పట్టుకుంటున్నారు. నగదు, బంగారం చోరీ కేసుల్లోనే నిందితులను పట్టుకునేందుకు సరిపోను సిబ్బంది లేక సతమతమవుతుంటే మూగజీవాల అపహరణపై వస్తున్న ఫిర్యాదులు తలనొప్పిగా మారాయని ఓ పోలీస్ అధికారి వ్యాఖ్యానించారు.

చోరీ చేసిన గంటలోనే..

మేకలను అపహరించుకుపోయిన నిందితులు గంట వ్యవధిలోనే వాటి ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. యజమాని గుర్తుపట్టకుండా మేక తోలు తీసేయడం, తలను వేరు చేసి ఆధారాలు లేకుండా చేస్తున్నారు. తమ ఇంట్లో శుభకార్యం చేస్తున్నామని బంధువులు తక్కువ సంఖ్యలో వచ్చారని, అనవసరంగా రెండు మేకలను కోశామంటూ మాంసం విక్రయదారులకు తక్కువ ధరకు అమ్మేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సీసీ కెమెరాలు ఉంటేనే..

నల్లగొండలోని రాజీవ్ గృహకల్ప వద్ద దుండగులు మేకలను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి కటకటాల వెనక్కి నెట్టారు. అదే విధంగా శ్రీరాంనగర్‌లో సైతం కోళ్లను మాయం చేస్తున్న వారిని సీసీ కెమెరాలో గుర్తించి అరెస్ట్ చేశారు. సీసీ కెమెరాల ఆధారంగానే మూగజీవాలను ఎత్తుకెళ్లే నిందితులను గుర్తించే అవకాశం ఉంటుందని పోలీసులు అంటున్నారు. గ్రామాలు, పట్టణాల్లోనే వీధులు, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

కూతురు బతుకు ఆగమైందని..

- మనస్తాపంతో పురుగుల మందు తాగిన తల్లి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

నకిరేకల్ : కూతురు బతుకు ఆగమైందని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్‌లోని కాటమయ్య బజారుకు చెందిన దొమ్మాటి రామలక్ష్మయ్య రిటైర్డ్ టీచర్. ఇతడి భార్య మంగమ్మ అలియాస్ మమత (48) వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెల వివాహం జరిగినప్పటికీ పెద్ద కూతురు ఉషారాణి నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకుంది. అప్పటి నుంచి ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. చిన్న వయసులోనే కూతురుకు విడాకులు తీసుకోవడంతో తల్లి మంగమ్మ మానసికంగా కుంగిపోయి ఈనెల 29న శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. అపస్మారస్థితిలో పడి ఉన్న ఆమెను పక్కింట్లో ఉంటున్న సోదరుడు జనార్దన్ చూసి తొలుత స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి నల్లగొండ, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆమెను సోమవారం నకిరేకల్‌కు తీసుకువచ్చారు. ఇంటికి వద్దకు వచ్చిన తరువాత మరోసారి మమత అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మంగమ్మ మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతురాలి భర్త రామలక్ష్మయ్య ఫిర్యాదు మేరకు సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు. కాగా, మంగమ్మ మృతదేహానికి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో పాటు నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, టీపీసీసీ నేత దైద రవీందర్ నివాళులర్పించి సంతాపం తెలపారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మంగమ్మ (ఫైల్)

ఇంటిపై దాడి.. సామగ్రి ధ్వంసం

నడిగూడెం: మండలంలోని బృందావనపురంలో పోతురాజు నాగేశ్వరరావు ఇంటిపై సోమవారం అదే గ్రామానికి చెందిన పుట్లా రామాంజనేయలు తదితరులు దాడిచేసి సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బృందావనపురం గ్రామానికి చెందిన పోతురాజు నాగేశ్వరావు కుమారుడు మహేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని జూలై 24న ప్రేమ వివాహం చేసుకున్నాడు. అనంతరం తమ వివాహానికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు రెండు కుటుంబాల పెద్దలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. యువతి తాను ప్రేమించిన వ్యక్తితోనే ఉంటానని చెప్పడంతో ఆగ్రహించిన ఆమె తరఫు బంధువులు మహేష్ ఇంటిపై దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

- పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్‌ఠాక్రే

నకిరేకల్: నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే సూచించారు. నకిరేకల్‌కు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్‌లు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయనను కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చామల శ్రీనివాస్, పీసీసీ డెలిగేట్ సుంకరబోయిన నర్సయ్యయాదవ్, సీనియర్ నాయకులు జటంగి వెంకటనర్సయ్య, లింగాల వెంకన్న, యాస కర్ణాకర్‌రెడ్డి, జమీరుద్దీన్, సాల్వేర్, అశోక్, బొప్పని యాదగిరి, పల్‌రెడ్డి ఉపేందర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, ముక్కాముల శేఖర్, బడుగుల చంద్రశేఖర్, మేడి విజయ్ ఉన్నారు.


హైదరాబాద్‌లో మాణిక్‌రావ్ ఠాక్రేను సన్మానిస్తున్న నకిరేకల్ కాంగ్రెస్ నాయకులు

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

భువనగిరి : రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన రాయగిరి రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయగిరి–వంగపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య రాయగిరి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉన్నట్లు తెలిపారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు ఫుల్ చొక్కా పై బ్లూ చెక్స్ ఉన్నాయి. బ్లూ రంగు పాయింట్ ధరించి ఉన్న వ్యక్తి హిందువులా ఉన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎస్ సత్యనారాయణ తెలిపారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గురుకుల పాఠశాల విద్యార్థి హల్‌చల్

మోత్కూరు : గురుకుల పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి గోడ దూకి పరారై హల్‌చల్ సృష్టించాడు. ఈ సంఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. విద్యార్థుల కథనం ప్రకారం.. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో కొత్త బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఓ భవనంలో ఎస్సీ గురుకుల బాలుర పాఠశాలను వడ్డెర కాలనీలోని మరో భవనంలో నిర్వహిస్తున్నారు. బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న భవనంలో 5 నుంచి 7 తరగతుల వరకు తరగతులను నిర్వహిస్తున్నారు. 5వ తరగతి విద్యార్థి అఖిలానందన్ సోమవారం ఉదయం గురుకుల పాఠశాల ప్రహరీ దూకి సమీపంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లి అక్కడి నుంచి నల్లగొండ బస్సు ఎక్కి వెళ్లాడు. అప్పటికే సమాచారం పొక్కడంతో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. బస్టాండ్ కంట్రోలర్ శ్రీనివాస్ ద్వారా బస్సు కండక్టర్ సహాయంతో అఖిలానందన్ విద్యార్థిని బస్సులోనే పట్టుకున్నారు. హాలియాకు చెందిన అతని తల్లిదండ్రులను రప్పించి పరారైన విద్యార్థిని నల్లగొండలో అప్పగించినట్లు ప్రిన్సిపాల్ వెంకటనర్సయ్య తెలిపారు.

మహిళలను దూషించిన వ్యక్తికి మూడు నెలల జైలు, జరిమానా

నిడమనూరు: ఇంటికి ఫోన్ చేసి మహిళలను దూషించిన వ్యక్తికి మూడు నెలల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వప్న సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ ఆఫీసర్ అలీ మహ్మద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన కర్నె మోహన్ రెడ్డి ఇంటికి త్రిపురారం మండలం గంటారావ్ క్యాంపునకు చెందిన ముఢావత్ శ్రీధర్ ఫోన్ చేసి అతని భార్య, అమ్మమ్మను అసభ్యకరంగా తిట్టాడని 2017 ఏప్రిల్ 8న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ ఆరిఫ్ కేసు నమోదు చేసి శ్రీధర్‌ను కోర్టులో రిమాండ్ చేశాడు. శ్రీధర్‌పై నేరం నిరూపణ కావడంతో జడ్జి మూడునెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని అలీ తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వానికి నిరుద్యోగులపై చిత్తశుద్ధి లేదు

మోత్కూరు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నిరుద్యోగులపై చిత్తశుద్ధి లేదని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ గురుకుల రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరీక్షల తీరే ఇందుకు నిదర్శనమని అన్నారు. సోమవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న నోటిఫికేషన్లలో ఈ పరీక్షలకు రాష్ట్రంలో లక్షలాది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో వరుసగా మూడు పరీక్షలు రాసే అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వరుసగా మూడు పరీక్షలు రాసే అభ్యర్థులు ఒక్కొక్క జిల్లాలో ఒక్కో పరీక్ష రాయాలంటే మహిళా అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఒకే జిల్లాలో మూడు పరీక్షలు రాసే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర నాయకులు అవిశెట్టి అవిలుమల్లు, బయ్యని రాజు, నిమ్మల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు నిలిగొండ మత్స్యగిరి, నిరుద్యోగ అభ్యర్థులు రాజు, నర్సింహ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బుర్ర శ్రీనివాస్‌గౌడ్

ట్రాక్టర్ కిందపడి రైతు, డ్రైవర్ దుర్మరణం

- పొలం దున్నుతుండగా బురద మడిలోనే ఘటన
- జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లిలో విషాదం


బురద పొలంలో ట్రాక్టర్ టైర్ల కింద మృతదేహాలు

అర్వపల్లి: బురదమడి దున్నుతున్న క్రమంలో తొలుత రైతు...ఆ వెంటనే డ్రైవర్ ట్రాక్టర్ కింద పడి దుర్మరణం చెందారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లిలో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటనపై పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పర్సాయపల్లి గ్రామానికి చెందిన రైతు దండ భద్రారెడ్డి వద్ద బొల్లంపల్లి గ్రామానికి చెందిన పసుల రామలింగయ్య(52) రెండు నెలల నుంచి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం పర్సాయపల్లికి చెందిన రైతు మిడతపల్లి మల్లయ్య తన ఎకరం వ్యవసాయ భూమిలో వరిపాలం సాగు చేయడానికి భద్రారెడ్డి వద్దకు వెళ్లగా డ్రైవర్ రామలింగయ్యను పొలం దున్నడానికి పంపించాడు. డ్రైవర్ రామలింగయ్య ట్రాక్టర్ ఇంజన్‌కు నాగలి, ఇనుప చక్రాలు బిగించుకొని వెళ్లి మడి దున్నడం ప్రారంభించాడు. బురదమడిలో ట్రాక్టర్‌ను వెనుకకు ముందుకు ఆడిస్తుండగా వెనుక వైపు నుంచి పొలం గట్టు మీద ఉన్న రైతు మల్లయ్య కాలు జారి ప్రమాదవశాత్తు మడిలో పడిపోయాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఇనుప చక్రాలు (వీల్స్) మల్లయ్య కాలుపైనుంచి పోవడంతో ఒక్కసారిగా కేకలు వేస్తూ భయంతో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రైతు మల్లయ్య కేకలు విన్న డ్రైవర్ రామలింగయ్య షాక్‌కు గురై వెంటనే వెనుక ఏమి జరిగిందోనని చూస్తూ కిందికి దిగుతున్న క్రమంలో ఒక కాలు ఇంజన్ క్లచ్‌లో ఇరుక్కుపోయి కిందికి పడి తల బురదలో టైరు, వీల్ కింద పడి ఊపిరాడక క్షణాల్లోనే మరణించాడు. అయితే డ్రైవర్ రామలింగయ్యకు కొంత కాలంగా మూర్ఛ(ఫిట్స్) ఉండటంతో ఇలా జరిగి ఉండవచ్చని ప్రజలు అనుమానిస్తున్నారు. సమీపంలోని రైతులు ప్రమాదాన్ని చూసి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ అంజిరెడ్డి సంఘటనా స్థలికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదులు తీసుకొని కేసుదర్యాప్తు చేస్తున్నారు. మృతులు మల్లయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. రామలింగయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రామలింగయ్య ఇద్దరి కుమార్తెల వివాహం చేయగా చిన్న కూతురి వివాహం కావాల్సి ఉంది.



మల్లయ్య, రామలింగయ్య (ఫైల్)


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

రెండు గ్రామాల్లో విషాదఛాయలు

రైతు మలయ్య స్వగ్రామం పర్సాయపల్లి, డ్రైవర్ రామలింగయ్య స్వగ్రామం బొల్లంపల్లి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. రెండు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి తరలి వచ్చి ఇద్దరు మృతి చెందిన పరిస్థితిని చూసి కంటతడి పెట్టారు. ఒకరెనక ఒకరు మృతిచెందడం, ఇద్దరి మృతదేహాలు పక్క పక్కనే ఉండడంతో మృతుల కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. సంఘటనా స్థలానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు పుప్పాల శేఖర్, దానం సుజాతయాదగిరి, మాజీ జెడ్పీటీసీ కొత్రపిడత అవిలయ్య, మాజీ ఎంపీపీ పంది ఎర్రనర్సయ్య, ఎంపీటీసీ రాచకొండ గీతాసురేష్, మాజీ సర్పంచ్ భరత్‌రెడ్డి, దేవస్థాన డైరెక్టర్ తోట నర్సయ్య, దండ వీరారెడ్డి తదితరులు చేరుకొని నివాళులర్పించి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


జంగయ్య (ఫైల్)

చింతపల్లి : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండలం గొల్లపల్లి పరిధిలోని సమైక్యనగర్ కాలనీకి చెందిన కున్‌రెడ్డి జంగయ్య(40) ఆదివారం రాత్రి చింతపల్లి వైపు నుంచి మాల్ వైపునకు మోటారు సైకిల్ వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కుర్మేడు సమీపంలో గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

6న ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ టౌన్ : ఏఐఎస్ఎఫ్ మాజీ విద్యార్థి సంఘం నాయకుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఈ నెల 6న నాగార్జునసాగర్ విజయ్‌విహార్ అతిథి గృహంలో నిర్వహిస్తున్నట్లు సంఘం మాజీ సీనియర్ నాయకులు కట్ట వెంకట్‌రెడ్డి తెలిపారు.. సోమవారం స్థానిక ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ, మెడికల్ కళాశాల కోసం ఏఐఎస్ఎఫ్ విరోచిత పోరాటం చేసిందని గుర్తుచేశారు. మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు విధిగా హాజరై సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్లా దేవేందర్ రెడ్డి, గుర్రంవెంకట్‌రెడ్డి, జిల్లా యాదయ్య, ముదిగొండ మురళీకృష్ణ, గుండా లింగారెడ్డి, సూర్యతేజ పాల్గొన్నారు.

రైతులు వరినారు శుద్ధి చేసుకోవాలి

మోత్కూరు : మున్సిపల్ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో నల్ల మధుసూదన్‌రెడ్డి వ్యవసాయ పొలంలో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీకి చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. వరి పొలంలో జీవ ఎరువుల ఉపయోగం గురించి వారికి వివరించారు. జీవ ఎరువుతో నాటు వేసుకునే ముందు నారును శుద్ధి చేసుకోవడం వల్ల వేర్లు బాగా అభివృద్ధి చెంది భూమిలో స్థిరీకరణమైన పాస్పరస్‌ను మొక్కలకు అందజేస్తుందని తెలిపారు. జీవ ఎరువును ఉపయోగించడం వల్ల పాస్పరస్ ఎరువుల వాడకాన్ని తగ్గిస్తుందన్నారు. జీవ ఎరువుల వలన భూమి సారవంతమవుతుందన్నారు. ఒక కిలో పాస్పరస్ 10–15 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు సరిపోయే నారును శుద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వ విద్యాలయం కళాశాల విద్యార్థులు డి.శిరీష, కె.ధరణి, జె.సునయన, మిస్బాసుల్తానా, ఎస్.నాగసాయి, మౌనిక పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నిత్యావసర సరుకులు ఎమ్మార్పీకే విక్రయించాలి

- నల్లగొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : నిత్యావసర సరకులు ఎమ్మార్పీకే విక్రయించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ వర్తక సంఘం ప్రతినిధులను కోరారు. నల్లగొండ అదనపు కలెక్టర్ సోమవారం తన చాంబర్‌లో నిర్వహించిన ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సామాన్యుడికి భారంగా మారుతున్న నిత్యావసర సరకుల విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. షాపుల్లో నిత్యావసర సరకుల స్టాక్, రేట్ల పట్టిక ప్రదర్శించాలని ఆదేశించారు. కూరగాయల్లో ముఖ్యంగా టమాటా, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డల కొనుగోలులో దళారీ వ్యవస్థని పూర్తిగా అడ్డుకోవాలని, విధిగా కూరగాయల వ్యాపారులు రేట్లను ప్రదర్శించి విక్రయించాలన్నారు. మార్కెట్లో కూరగాయల కొరతను సృష్టించి, అధిక రేట్లకు అమ్ముతున్నట్లు తెలుస్తోందని, దీనిపై అధికారులు వర్తకులు, సమన్వయంతో ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా కొంతమంది వ్యాపారులు పప్పు దినుసులు, నూనెల కొరత సృష్టించడంతో పాటు, స్టాక్‌ను మార్కెట్ రేటుకు కాకుండా ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నారని ఇది ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. అన్ని రకాల వర్తక వ్యాపారులు తమ షాపుల వద్ద పప్పు దినుసులు, నూనెల రేట్లు విధిగా ప్రదర్శించాలన్నారు. మున్సిపాలిటీ, పౌసరఫరాల, ఆహార తనిఖీ, తూనికల కొలతల అధికారులు బృందంగా ఏర్పడి తనిఖీలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల డీఎం నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ సుచరిత, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ శ్రీకాంత్, డీసీబీసీ కన్వీనర్ గురువయ్యా, హిమగిరి, వర్తక సంఘం ప్రతినిధులు రవికుమార్, ఆర్ సత్యనారాయణ, పి.ప్రసాద్, రేషన్ షాప్ డీలర్లు వైద్యుల సత్యనారాయణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్